# పరీక్ష.... నిర్మల

పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోని కడుగు పెట్టిన వాసు గుండెలు గుబగుబ లాడాయి.

"ఆగు! ఏమిటి నువ్వు చేస్తున్నది? ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించే నీ స్నేహితుడు ఎంత బాధపడతాడో ఆలోచించావా? హాస్యానికైనా ఒకహద్దంటూ వుంది," అంటూ హుంకరించింది వాసు అంతర్యం!

"ఫర్వాలేదు! ఇది హాస్యానికి మాత్రమే. కావాలంటే తర్వాత క్షమార్పణ వేడుకో. రవికి నీవంటే ఎంత ప్రేమో పరీక్షించి తెలుసుకో," అంటూ సమర్ధించాడు, వాసు.

వాడిన వాసు మోము ఒక చిరు నవ్వుతో వికసించింది. రిసీవరు ఎత్తాడు. ఏదో నెంబరు డయల్ చేశాడు. కొంత సేపటికి అవతలినుండి ఒకకంఠం "హల్లో!" అంది.

వాసు గొంతు మార్చి, "హల్లో! ఎవరూ మాట్లాడేది?...రవి వున్నాడా? ...నేనా! ... నేను ఉస్మానియా హాస్పిటల్‌నుండి డాక్టరును మాట్లాడు తున్నాను... ఆఁ! వాసు అనే అబ్బాయి ఒక యాక్సిడెంట్‌లో చిక్కుకొని ఇక్కడే అడ్మిట్ అయ్యాడు ... ఆఁ అతని జేబులోని డైరీలో మీపేరు ఫోన్‌నెంబరు ఉన్నాయి ... ఆఁ! రవి ... రవి అంటూ పలవరిస్తున్నాడు. వెంటనే రండి... ఆఁ! మూడో నెంబరు వార్డులో, సరే!" అంటూ ఫోన్ దించేశాడు. గుండె దడ దడ లాడింది. చేతులు వణుకు తున్నాయి. ముఖమంతా చెమటపట్టింది.

చెమట తుడుచుకుంటూ ఇంటిముఖం పట్టాడు వాసు. ఆ నాడే ఎప్రిల్ ఫస్ట్. రవి వాసుకు ప్రాణస్నేహితుడు. వాసు మిత్రుని ప్రేమను పరీక్షించా లనుకున్నాడు. దీనికి రవి ఎంత బాధపడ తాడో అనిపించినా, తమ స్నేహం ఇంకా గట్టిపడుతుందని భావించి తయారు చేశా డీ ప్లాను.

ఆలోచిస్తూ నడుస్తున్న వాసు ఊహా పథంలో రవి మెదలసాగాడు. ఈ వార్త విన్న రవి కారేసుకుని హాస్పిటల్‌కి వెళ్ళినట్లు, అక్కడ తన్ను కనుక్కోలేక సరాసరి తనయింటికే వచ్చినట్లు, నవ్వుతున్న తనని చూసి రెండుచేతులూ చాచి తనను గుండెలకు హత్తుకున్నట్లు ఊహిస్తూ నడుస్తున్న వాసుని, వెనుక నుంచి వస్తున్న చెవర్లెట్ కారుహారను ఈ లోకంలోకి తేలేకపోయింది. కారు కీచుమంటూ వాసుకు పక్కగా ఆగిపోయింది. వాసు కింద పడిపోయాడు. కొద్దిపాటి గాయం తగిలింది!

కారులోంచి గబగబా దిగివచ్చిన వ్యక్తి కిందపడ్డ వాసుని చూసి "వాసూ" అంటూ వెళ్ళి డ్రైవర్ సహాయంతో లేపి కార్లో కూర్చొబెట్టాడు. అతను రవి! ✲